# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 29-05-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

**1. కేంద్ర సమాచార ప్రసార శాఖ సహాయ మంత్రి ఎల్ మురుగన్ ఈరోజు అన్నమయ్య జిల్లాలో పర్యటిస్తున్నారు.**

**2. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు ఢిల్లీలో పర్యటించనున్నారు.**

**2. విజయవాడలో ఈ ఉదయం నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ పాల్గొని యోగాసనాలు వేశారు.**

**4. నూతన ఆవిష్కరణలపై రైతులకు అవగాహన కల్పించే కేంద్ర ప్రభుత్వ వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం ఈరోజు ప్రారంభమైంది.**

===========================

కేంద్ర సమాచార ప్రసార శాఖ సహాయ మంత్రి ఎల్ మురుగన్ ఈరోజు అన్నమయ్య జిల్లాలో పర్యటిస్తున్నారు. పర్యటనలో భాగంగా ఈ ఉదయం రాయచోటి మండలం లక్కిరెడ్డిపల్లిలో మాతంగ మహా పీఠాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మధ్యాహ్నం స్థానికంగా జరిగే పలు కార్యక్రమాల్లో కేంద్రమంత్రి పాల్గొంటారు. కాగా రేపు తిరుమలలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుంటారు.

---------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు ఢిల్లీలో పర్యటించనున్నారు. ఇందులో భాగంగా భారత పరిశ్రమల సమాఖ్య- సిఐఐ వార్షిక సమావేశంలో పాల్గొంటారు. రేపు మధ్యాహ్నం గన్నవరం విమానాశ్రయం నుంచి ఢిల్లీకి చేరుకుని సాయంత్రం జరిగే కార్యక్రమంలో పాల్గొంటారని అధికారులు తెలిపారు.

---------------------------

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం జూన్ 21వ తేదీ వరకు యోగాంధ్ర-2025 పేరుతో నెలరోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా పార్వతీపురం మన్యం, తిరుపతి, అంబేద్కర్ కోనసీమ జిల్లాలో యోగా కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో ఈ ఉదయం నిర్వహించిన యోగా కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

..వాయిస్... 30 సెకన్లు

---------------------------

యోగాంధ్ర వెబ్ సైట్ లో ఈ నెల 27నాటికి 28 లక్షల 55 వేల 48 మంది పేర్లు నమోదు చేసుకున్నారని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఒక ప్రకటనలో తెలిపారు.

---------------------------

ఈరోజు అంతర్జాతీయ శాంతి పరిరక్షకుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ పలు దేశాల్లో రక్షణ, సౌభాతృత్వాన్ని కాపాడేందుకు శాంతి కాముకులు కృషిచేస్తున్న నేపథ్యంలో వారి సేవలను గుర్తించేందుకు ఐక్యరాజ్యసమితి ప్రతి ఏటా మే 29వ తేదీన అంతర్జాతీయ శాంతి పరిరక్షకుల దినోత్సవంగా పాటిస్తోంది. 1948 నుంచి ప్రపంచ శాంతిని నెలకొల్పడంలో ప్రాణాలర్పించిన 3 వేల 8 వందల మంది శాంతి పరిరక్షకులను ఐక్యరాజ్యసమితి ఏటా గౌరవిస్తోంది.

---------------------------

కోవిడ్ వ్యాప్తిపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కృష్ణాజిల్లా ప్రాంతీయ వైద్యాధికారి అల్లాడి శ్రీనివాసరావు తెలిపారు. మచిలీపట్నంలో ఈ రోజు ఆయన మాట్లాడుతూ, కోవిడ్ కేసులను ఎదుర్కోవడానికి అన్ని రకాలుగా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ప్రభుత్వ సూచనలను అనుసరిస్తూ స్వీయ జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు.

---------------------------

అర్హులైన లబ్ధిదారులు గ్రామ, వార్డు సచివాలయాలలో రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకోవాలని శ్రీకాకుళం జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి జి. సూర్య ప్రకాశ రావు చెప్పారు. శ్రీకాకుళంలో ఈ రోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, జిల్లాలో ఇంతవరకు 6 లక్షల 66 వేల 730 రేషన్ కార్డులు ఉన్నాయని వీటిలో మార్పులు చేర్పులు ఉంటే చేసుకోవటానికి ప్రభుత్వం వీలు కల్పించిందని తెలిపారు. జూన్ ఒకటో తేదీ నుంచి గ్రామాల్లో చౌక దుకాణాల ద్వారా ఇక నుండి నిత్యావసర వస్తువుల పంపిణీ చేస్తామని అన్నారు.. కొత్త రేషన్ కార్డుల జారీ అనేది నిరంతర ప్రక్రియ అని దీనిపై ప్రజలు ఆందోళన చెందనవసరం లేదని స్పష్టం చేశారు.

---------------------------

వ్యవసాయంలో పంటల సాగు వ్యయాన్ని తగ్గించడం నూతన ఆవిష్కరణలపై రైతులకు అవగాహన కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఈరోజు నుంచి వచ్చే నెల 12వ తేదీ వరకు వికసిత్ కృషి సంకల్ప అభియాన్ ను నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా 7వందలకు పైగా జిల్లాలలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో వ్యవసాయ, వ్యవసాయ ఆధారిత ఇతర రంగాల విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొంటున్నారు. వీరు ప్రతిరోజు రెండు మూడు గ్రామాలను సందర్శించి రైతులతో ముఖాముఖి నిర్వహిస్తారు. ఈ సందర్భంగా రాబోయే ఖరీఫ్ పంటకాలానికి అనువైన పంటలు,అధిక దిగుబడి రకాలు , పంటల వైవిధ్యం, నూతన సాంకేతిక పరిజ్ఞానం మొదలైన అంశాలపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తారు.

ఇలా ఉండగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో నిర్వహిస్తున్న వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ కోరారు. బుక్కరాయసముద్రం మండలం దెయ్యాలకుంటపల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ఈ రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,

వాయిస్..29 సెకన్లు

---------------------------

నీటి సంరక్షణ, నిర్వహణతో పాటు, ముఖ్యంగా వర్షపు నీటిని సద్వినియోగం చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం జలశక్తి అభియాన్‌లో వర్షపునీరు ఒడిసిపట్టడం “క్యాచ్ ది రైన్” కార్యక్రమాన్ని చేపట్టింది. “ప్రజా అవగాహన దిశగా నీటి సేకరణలో ప్రజల భాగస్వామ్యం“ అనే ఇతివృత్తంతో దేశవ్యాప్తంగా 148 జిల్లాలలో ఈ ప్రచారాన్ని ఈ ఏడాది మార్చి 22 నుండి నవంబర్ 30 వరకు నిర్వహిస్తోంది. ప్రజలు వర్షపు నీటిని సేకరించి, భవిష్యత్తులో ఉపయోగించుకునేలా ప్రోత్సహించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది.

ఇందులో భాగంగా వాతావరణ మార్పుల ద్వారా పెరుగుతున్న నీటి కొరత నేపథ్యంలో నీటి భద్రత, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పునరుజ్జీవనం ప్రాముఖ్యతపై పలు అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

-------------------------

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ –UPSC అభ్యర్థులకు మెరుగైన సేవలు అందించేందుకు కొత్త ఆన్‌లైన్ అప్లికేషన్ పోర్టల్ One-time Fresh Registration System- OFRSను ప్రారంభించనట్లు అధికారులు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ పోర్టల్ ద్వారా అభ్యర్థులు ఎప్పుడైనా తమ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించి, మూడు భాగాలుగా పూర్తి చేయవచ్చు అని తెలిపారు. ఈ కొత్త పోర్టల్ ద్వారా అభ్యర్థులు తమ దరఖాస్తులను పూర్తి చేసి అవసరమైన పత్రాలను అప్‌లోడ్ చేయడంతో భవిష్యత్‌లో జరిగే పరీక్షల దరఖాస్తులకు సులభతరం అవుతుందని పేర్కొన్నారు. ఇకపై పాత వన్ టైమ్ రిజిస్ట్రేషన్ -OTR విధానం అమలులో ఉండదని స్పష్టం చేశారు.

-------------------------

వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం కొనసాగుతోందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రానున్న రెండు రోజుల పాటు భారీ వర్షాలతో పాటు ఈదురు గాలులు వీచే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎమ్.వెంకట్రావు పేర్కొంటూ...

వాయిస్... 32 సెకన్లు

=====================